# సరిహద్దు

బయట...

లేత ఎండ ప్రియురాలి కౌగిలిలా వెచ్చవెచ్చగా ఉంది.

రెమ్మల చివర్న వేలాడి భూమ్మీద పడిన మంచుబిందువులు భూమికి పట్టిన చమట బిందువుల్లా ఉన్నాయి.

రాత్రంతా మంచుకి తడిసిన చెట్లు లేత ఎండలో ఆకుల తడి ఆరబెట్టుకుంటున్నాయి.

కొమ్మల్లో కూర్చున్న పిట్టలు భౌళిరాగంలో సన్నగా పాడుకుంటున్నాయి.

ఊరిచివర తోటలోంచి వస్తున్నగాలి పాతవైన్‌లా మత్తుగా వీస్తోంది.

ప్రకృతి అంతా నచ్చిన పిల్ల నవ్వులా అందంగా హాయిగా ఉంది.

అయితే

ఊరవతల బంగళాలో...

పరివార జనం అంతా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని నిల్చున్నారు.

బంగళా కాంపౌండులో వున్న చెట్లు ఎంత చల్లగాలి వీస్తున్నప్పటికీ ఒళ్ళు మరచిపోకుండా కేవలం తలలు మాత్రం అతికష్టం మీద కదుపుతున్నాయి.

చెట్లమీద పక్షులు గట్టిగా అరుస్తే అయ్యగారికి కోపం వస్తుందని అతి నెమ్మదిగా గుసగుస లాడుకుంటున్నాయి. హాల్లో ఎక్వేరియంలో వున్న చిన్నచిన్న చేపపిల్లలు ఈత మాని అడుగున చేరి నిశ్శబ్దంగా నిద్రపోతున్నాయి.

హాల్లో పచార్లుచేస్తున్న చలపతిరావు గారు మాత్రం పరమకోపంగానూ, అతి చికాగ్గానూ ఉన్నారు. అసలాయనకి కోపం రావడంగాని, చికాకు పడటంగాని ఎవరూ చూడలేదు.

ఆయన మొహంలో ఎప్పుడూ నవ్వు చెరగదు. కాకపోతే ఆ నవ్వు కొన్ని సమయాల్లో పసిపిల్లాడి నవ్వులా అందంగానూ, అమాయకంగానూ ఉంటే, మరికొన్ని సమయాల్లో మతోన్మాది మనస్సులా భయంకరంగా ఉంటుంది. ఆయన ఎలక్షన్లు, తుఫాన్లు వగైరా చిన్న చిన్న వాటికి భయపడే చిల్లర మనిషి కారు.

ఇన్‌కం టాక్స్ వాళ్ళూ, ఇంద్రుడూ కూడా ఆయన్నేం చెయ్యలేరు.

ఆయన తన ఫారిన్‌కార్లో అలా రోడ్డుమీద వెళ్తుంటే భయంతో మనుషులు, భక్తితో పశువులు పక్కకి తప్పుకుంటాయి.

ఆయన పంచాయితీ మీటింగ్‌లో మాట్లాడుతూంటే తలుపుల మీదనున్న పిచ్చికలు కూడా అల్లరిమాని బుద్ధిగా వింటాయి.

ఆయన అవకాశం లేకపోతే అన్నం తినడమైనా మానేస్తారుగాని, పంచాయితీ ఆఫీసులో వున్న తన తండ్రి నిలువెత్తు తైలవర్ణ చిత్రానికి పువ్వులదండ మాత్రం మానరు.

అసలాయన తండ్రి...

సింహాచలం ఏదో ఊర్లో సినీమాహాలు దగ్గర సోడాలమ్మేవాడు. ప్రతి తండ్రికి తన కొడుకు తనకంటె గొప్పవాడవ్వాలన్నకోరిక సహజం. సింహాచలం కూడా తన కొడుకు తనలా సోడాలమ్మకుండా, గొప్పవాడైపోవాలని అనుకునేవాడు. అయితే ఆ గొప్ప ఏరకంగానో అతనికి తెలీలేదు.

సాధారణంగా సినిమా హాల్లో సోడాలమ్మేవాళ్లు, వేరుశనక్కాయలు అమ్ముకునే వాళ్ళు యిష్టం వున్నా లేకపోయినా ప్రతి సినీమా ప్రతి రోజూ చూస్తారు. సింహాచలం కూడా దాదాపు ప్రతి రోజూ సినీమా చూసేవాడు. చాలా సినీమాల్లో తండ్రులు, తల్లులు సోడాలమ్మి కుండలుచేసి, కూరలు పండించి, వంటచేసి, పిండిరుబ్బి కొడుకుల్ని కలక్టరో, పోలీసాఫీసరో చేశేవారు.

సింహాచలానికి ఎందుకో కలక్టరు ఉద్యోగమే బాగా నచ్చింది. అంచేత తన కొడుకుని కలక్టరే చెయ్యాలని నిశ్చయించుకున్నాడు. అయితే కలెక్టరుని చేద్దామన్న తపన తండ్రికేగాని, ఔదామన్న కోరిక కొడుక్కి లేకపోవటం వల్ల చలపతిరావు చదువు అయిదోక్లాసుతో ఆగిపోయింది. ఆ తరవాత తండ్రిలా సోడాలమ్మడానికి అతని అయిదోక్లాసు అడ్డొచ్చింది.

ఇంత చదువు చదివి వెధవ సోడాలమ్ముకోవడవా? అన్న బాధతో కొన్నాళ్లు విలవిల్లాడి పోయేడు. అయితే ఆ 'యింత చదువు'కి ఎవరూ ఏ ఉద్యోగం యివ్వలేదు. యీ లోగా సోడా లమ్ముకునేతండ్రి స్వర్గాని కెళ్లిపోవడంతో అతనికి ఏదో ఒకటి చెయ్యకతప్పలేదు. ఆపద్ధర్మంగా అందాకా ఏదో కంపెనీలో కూలీగా చేరేడు. తీరికవేళల్లో లాటరీటిక్కట్లు అమ్మేడు.

అదిగో అప్పుడే అతనికి జీవితం చాలా నిజాల్ని నేర్పింది. "చదువుకీ, ఉద్యోగానికీ సంబంధం లేదు. డబ్బు ఆర్జించాలన్న కోరిక ఉండాలే కాని ఆర్జించే మార్గాలు లక్షలున్నాయి. సంఘంలో ఓ లెవెల్ కి చేరాలంటే ఉండాల్సింది ఉద్యోగం కాదు. చదువు అంతకంటే కాదు. డబ్బు. దాన్ని మనం ఆర్జిస్తే, అదే మనకి పరువు, ప్రతిష్ట, పలుకుబడి అన్నీ సంపాదించి పెడుతుంది. చదువుతో డబ్బు ఆర్జించలేకపోవచ్చును. కానీ డబ్బుతో చదువుని కొనుక్కోవచ్చును. చదువుతో ఉద్యోగం తెచ్చుకోలేకపోవచ్చును గాని డబ్బుతో ఏ ఉద్యోగమైనా రక్కున కొనుక్కోవచ్చును"....ఇలాంటి నిజాలు తెలుసుకున్న రోజునుంచి మరింక చలపతిరావు తను చదువుకోలేకపోయానే అన్న విచారం వదిలేశేడు.

జీవితాన్ని వైకుంఠపాళీతో పోలిస్తే, అతని జీవితంలో నిచ్చెనలే తప్ప ఒక్క పాముపిల్ల కూడా తగల్లేదు. కూలివాడు కలక్టరవకపోవచ్చు కాని ట్రేడ్ యూనియన్ లీడర్ అవగలడు. చలపతిరావు అదే అయ్యేడు. అలా, లీడరుగా వున్న రోజుల్లోనే ఏదో...ఒక మేడ, ఓ నాలుగు లారీలు కొన్నాడు. అలా లీడరుగా వుంటూనే తన వార్డుకి మెంబరయ్యేడు.

తను కూలీగా వున్న రోజుల్లో తన పాత ప్రియురాలు వెంకమ్మని తెచ్చి వెంకటలక్ష్మిగా మార్చి తన ధర్మపత్నిగా చేసుకున్నాడు. అలా అలా పంచాయితీ ప్రెసిడెంటై ధర్మప్రభువు చలపతిరావు బాబు అయిపోయేరు.

వారికి భగవంతుడి యందు పూర్తి భక్తి, విశ్వాసం ఉన్నప్పటికీ, భగవంతుడికి మాత్రం వీరియందు పూర్తి దయ కలగలేదు. సంవత్సరాలే దొర్లుతున్నాయికాని వారి నట్టింట ఒక్క నలుసు కూడా దొర్లలేదు. ఆ నలుసు కోసం వారు పాలుపొయ్యని పుట్టలేదు, ఉయ్యాల కట్టని చెట్టులేదు.

ఏడు కొండలూ ధర్మపత్నితో సహా నడిచి ఎక్కడవేఁ కాకుండా, నడిచే దిగేరు.

మంత్రాలయం వెళ్ళేరు. మంగళగిరి వెళ్ళేరు.

భద్రాచలంలో సీతమ్మవారికి ముత్యాల ముక్కుపుడక చేయించేరు. ఆ సీతమ్మ తల్లి తన ముక్కుపుడక చూసుకొని మురిసిపోయిందే కాని, వారి మొక్కు తీర్చలేదు.

విశాఖపట్నం కనకమహాలక్ష్మికి వజ్రాల వంకి చేయించేరు. ఆ మహా లక్ష్మి వంకీ పెట్టుకొని వయ్యారాలు పోయిందేతప్ప వారికి వరం ఇవ్వలేదు.

ఏ దేవుఁడూ కరుణించలేదు.

ఏ దేవఁతకీ దయ కలగలేదు.

ఎంతటి భక్తులకైనా భగవంతుడి పైన అపనమ్మకం కలిగేక్షణాలు కొన్ని ఉంటాయి. రామదాసంతటి వాడికి శ్రీరామచంద్రుడిమీద కోపం వచ్చింది. అయితే......అదిగో....అప్పుడే భగవంతుడు భక్తుల్ని పరీక్షిస్తాడేతప్ప శిక్షించడు అన్న దానికి నిదర్శనంగా ఆ ఊరు ఒక స్వామివారు వేంచేశారు.

ఆ స్వామివారు మల్లెపువ్వులు, మందార పువ్వులు కలిపిచేసినట్టున్నారు.

వారివద్ద కూర్చుంటే ఎప్పుడూ సంపెంగలూ, సన్నజాజులూ కలిపిన కమ్మటి వాసన వస్తూవుంటుంది.

వయస్సు నలభైలోపే అయినా వారు నాలుగు వేదాలూ తిరగేసి నవిఁలేశేరుట. అయిదోవేదం ఆయనే రాస్తారుట. వారు చిన్నతనంలో ఏ స్కూల్లోనూ చదువుకోకపోయినా, అన్ని భాషలూ అనర్గళంగా మాట్లాడగలరు. అన్నిటికంటె గమ్మత్తేవిఁటంటే ఏ భాష మాట్లాడితే అచ్చు ఆ భాషవాడిలాగే మాట్లాడుతారు. ఆయన మొహం చుట్టూ ఓ వింత వర్చస్సు వెలిగిపోతూ ఉంటుంది. సగం జబ్బులు ఆ వర్చస్సు నుంచి వచ్చిన వెలుతురు వల్లే నయం అయిపోతాయిట. ఎంతమందో స్పెషలిస్టులు చప్పరించి వదిలేసిన జబ్బులు చిటికెడు విబూదితో కుదిరిపోతాయట.

సాధారణంగా ఆ ఊరు ఏ స్వాములారు వచ్చినా, ఏ సినిమా తారవచ్చినా, లేక ఏ పొలిటీషియన్ వచ్చినా చలపతిరావు గారింట్లో

బస చేయడం ఆనవాయితీ. ఆయన ఊర్లో ఉన్నా లేకపోయినా ఆ ఆనవాయితీ అమలు జరగవలసిందే! మరంచేత ఆ స్వామివారు కూడా చలపతిరావు గారింట్లోనే బస చేశారు.

యతీంద్రుడి వేషంలో వున్న అర్జునుడ్ని అతి భక్తితో కొలిచింది సుభద్ర. అంతకంటె భక్తితో కొలిచేరు వెంకటలక్ష్మిగారు స్వామివార్ని.

ఇద్దరి భక్తిలో తేడా లేకపోయినా యిద్దరి కోరికలకి తేడా వుంది.

ఒకరు కళ్యాణం కోరితే, మరొకరు కొడుకుని కోరేరు.

స్వామివారు ఎవరికీ ఎప్పుడూ మాట యివ్వరు.

యిస్తే తప్పరు.

స్వామివార్ని కొలిచిన రెండు నెలలకి వెంకటలక్ష్మిగారు నెలతప్పేరు.

ఆ స్వామివారి ప్రసాదమే చిరంజీవి వరప్రసాదు.

అలా పుట్టిన చిరంజీవి పారిస్‌నుండి తెప్పించిన సెంట్లు, పౌడర్లుతోను, అమెరికా నుంచి తెప్పించిన ఆటవస్తువులతోను పెరుగుతున్నాడు.

మూడో ఏట కాన్వెంటుకి వెళ్ళడానికి అతనికి అప్పుడే ఓ చిన్న ఫారిన్ కారు కొనే ఉంచేరు చలపతిరావుగారు.

హైస్కూలుకి వచ్చేక ఆడుకోవడానికి టెన్నిస్ రాకెట్ ఇంగ్లండు నుంచి తెప్పించేరు.

ప్రస్తుతం అతను సాయంత్రం అలా షికారు వెళ్ళడానికి స్విట్జర్లండు నుంచి తెప్పించిన తోపుడుబండి ఉండనే వుంది.

అతను ఇంగ్లీషులో పెరగడానికి వీలుగా ఓ ఆంగ్లో ఇండియన్ ఆయా ఉండనే వుంది.

చిరంజీవి ఏడుపు అనే మాట తెలీకుండా పెరగాలని చలపతిరావుగారి తాపత్రయం.

అసలు పిల్లలు పుట్టగానే ఏడుస్తారు. ఒకవేళ అలా ఏడవకపోతే అక్కడున్న డాక్టరో, నర్సో రెండు తగల్నిచ్చి మరీ ఏడిపిస్తారు. చిరంజీవి ప్రసాదు పుట్టగానే ఏడవలేదు. ప్రెసిడెంటుగారి అబ్బాయిని కొట్టడానికి చేతులు రాలేదుట ఆ డాక్టరమ్మకి. అయినా కొట్టక తప్పదు కాబట్టి చిటిక వేసినట్టు చిన్నగా కొట్టిందిట. అప్పుడా చిరంజీవి ఏడవలేదు సరికదా డాక్టరమ్మని చూసి నవ్వేట్ట. ఆ సంగతి ఇప్పటికీ ఆ డాక్టరమ్మ

అందరితోనూ సరదాగా చెప్తూ "నాటీ బోయ్" అంటూ వుంటుంది.

అలా పుట్టిన చిరంజీవి ఈ ఏణ్నర్ధంలోను ఎప్పుడూ ఏడిచి ఎరగడు. అయితే ఓ అరగంట నుంచి ఆగకుండా ఏడుస్తున్నాడు. బొమ్మలిస్తే విసిరేస్తున్నాడు. పాలు వగైరా ఏది పట్టినా నోరు తెరిచి మింగడంలేదు. ఎత్తుకుంటే చేతుల్లో గిలగిల కొట్టుకుంటున్నాడు.

అదుగో...అందుకే...చలపతిరావు గారు తెగ చికాకు పడిపోతున్నారు.

"ఇంత డబ్బుంది. పలుకుబడి వుంది, కౌరవ సైన్యంలా బలగం వుంది, యిదేవిఁటి? ఆఫ్టరాల్ పసివాడి ఏడుపు మానిపించలేనివి ఎందుకు ఇవన్నీ?" అని తెగ విసుక్కుంటున్నారు.

పెద్దవాళ్ళు విసుక్కున్నంత మాత్రాన పిల్లలు ఏడుపు మానరు.

చిరంజీవి కూడా మానలేదు.

చిరంజీవి ఏడుపు ఎక్కువౌతోంది.

చలపతిరావుగారి చికాకు ఎక్కువౌతోంది.

ఇటు చినబాబుగారి ఏడుపు, అటు పెదబాబుగారి చికాకు చూస్తున్న పరివారానికి అరచేతిలో పట్టుకున్న ప్రాణాలు జారిపోతున్నాయి.

వాళ్ళంతా గోడకి అనుకొని రెప్పలు మాత్రం ఆడించే బొమ్మల్లా వున్నారు.

పుట్టినప్పటి నుంచి చిరంజీవి మంచాల మీదో, మనుషుల మీదో తప్ప నేలని కాలు పెట్టి ఎరగడు.

యీ పూట ఎందుకోగాని వెంకట లక్ష్మిగారు ఎంత గట్టిగా పట్టుకున్నాసరే కిందికి దిగడానికి ప్రయత్నిస్తున్నాడు.

చలపతిరావుగారి కెందుకో అకస్మాత్తుగా తట్టింది. చిరంజీవి కిందికి దిగడానికే ఏడుస్తున్నాడేమో! దింపడం వారికెంత మాత్రం ఇష్టం లేదు. కానీ యిప్పుడీ ఏడుపు మానిపించాలంటే ఆ మాత్రం కష్టపెట్టక తప్పదు.

"ఒక్కసారి దించు లక్ష్మీ" అరిచినట్టే చెప్పేరు.

వారి అరుపుకి వాకిట్లో చెట్లమీద కబుర్లు చెప్పుకుంటున్న పిట్టలన్నీ ఎగిరిపోయేయి.

టేబిలుమీది ఫ్లవర్ వేజులోని గులాబీలన్నీ రేకులు రాల్చేశేయి.

తల్లి ఒళ్ళో నుంచి దిగిన చిరంజీవి యావజ్జీవ శిక్ష నుంచి అనుకోకుండా విడుదలైన ఖైదీలా, గబగబ గుమ్మంవేపు నడిచేడు.

అలవాటులేని నడకవల్ల అడుగులు తడబడుతున్నాయి.

యువరాజు వెనక పరివారంలా మిగతా వారంతా అనుసరించేరు.

గుమ్మం దగ్గర యువరాజు ఆగేడు.

పరివారవూఁ ఆగింది.

ఎదురుగా కనిపించిన దృశ్యం చూసిన పరివారం ప్రతిమలే అయిపోయేరు.

కోపంతో ఊగిపోయేరు చలపతిరావు గారు.

ఊపిరి తీసుకోవడం మరిచిపోయింది పనిమనిషి పైడమ్మ.

అక్కడ...కాంపౌండులో...గేటుకి దగ్గరగా...

మనుషులకి దూరంగా ఓ చెట్టునీడని అడుగున్నర ఎత్తున ఉన్న చిన్న పిల్ల తలొంచుకొని ఆడుకుంటోంది.

ఆ పిల్ల ఒంటిమీద అరంగుళం ఎత్తున దుమ్ము తప్ప, అరంగుళం దారప్పోగు కూడా లేదు.

మట్టిలో పుట్టి, మట్టిలోనే పెరిగిన మట్టిపిల్లలా వుంది.

ఆ పిల్లచేతిలో చిరిగిన గుడ్డపీలికల్తో చేసిన ఓ బొమ్మలాంటి వస్తువుంది.

ఆ పిల్ల ఆ బొమ్మని చొంగకారుతున్న నోటితో మధ్యమధ్య ముద్దు పెట్టుకుంటోంది.

ప్రపంచాన్నంతటినీ జయించినంత తృప్తి ఉంది ఆ పిల్ల మొహంలో.

ఆ పిల్ల పైడమ్మ కూతురు.

రోజూ పనిలోకొస్తున్నప్పుడు ఆ పిల్లని అక్కడ వదిలేసి మళ్ళీ ఇంటికి వెళ్తున్నప్పుడు తీసికొని వెళ్లిపోతుంది పైడమ్మ.

తాత్కాలికంగా ఆగిన చిరంజీవి మళ్లీ నడక ప్రారంభించేడు ఆ పిల్లవేపు.

చలపతిరావుగారు కోపంతోను, అవమానంతోను ఊగిపోయేరు. ఆయన ఒక్కసారి పైడమ్మవేపు చూసి వెనక్కి తిరిగి గబగబ మేడ మీదికి వెళ్ళిపోయేరు. ఆయన్ని అనుసరించాలో అక్కర్లేదో తెలీని పరివారం మధ్యలోనే ఆగిపోయేరు.

అందరికంటె ముందుగా తేరుకున్నది వెంకటలక్ష్మిగారే.

"పైడమ్మా ముందా పిల్లని తియ్యి" అన్నారు.

ఆ మాట కోసమే ఎదురుచూస్తున్న దానిలా పరిగెత్తబోయింది పైడమ్మ. కాని పక్షవాతం వచ్చినదాన్లా కాళ్లు కదల్లేదు.

తల్లి చేతిలోంచి విడిపించుకున్న చిరంజీవి పడుతూ లేస్తూ ఆ పిల్లవేపే వెళ్తున్నాడు.

అంతవరకు తపస్సమాధిలో వున్న బాలయోగినిలా వున్న ఆ పిల్ల లేచి వరం యివ్వబోతున్నదాన్లా నోట్లో బొమ్మతో సహా వస్తోంది.

అతన్ని ఆపాలని తట్టలేదు వెంకట లక్ష్మిగారికి.

ఆ పిల్లని ఆపాలని తట్టలేదు పైడమ్మకి.

ఆ పిల్ల చిరంజీవికి దగ్గరగా వచ్చింది.

వచ్చి ఒక్క నిమిషం అతని మొహంలోకి చూసింది.

చిరంజీవి ఏడుపు ఠక్కున ఆపేసేడు.

ఆపి ఆ పిల్లవేపు చూసి నవ్వేడు.

ఆ పిల్ల కూడా నవ్వింది. తరువాత తన చేతిలో వున్న బొమ్మ అతని చేతిలో పెట్టింది. పెట్టి అతని రెండో చేతిని పట్టుకొని తను యిదివరకు కూర్చున్న చెట్టుదగ్గరికి నడిపించుకొని వెళ్ళింది.

ఆ పిల్లచేతిలో చెయ్యి కలిపి నడుస్తున్న చిరంజీవి మొహంలో అడ్డులన్నీ దాటి అంతఃపురం ప్రవేశించి రాజు కూతుర్ని చేరుకున్న రాజకుమారుడి గర్వం వుంది.

తనక్కావలసింది తనే స్వయంగా సంపాదించేనన్న ఆత్మ విశ్వాసం వుంది.

తన చుట్టూవున్న హద్దులన్నీ దాటి సరిహద్దు చేరుకోగలిగేనన్న ఆత్మానందం వుంది.

పుట్టగానే నవ్విన నవ్వు తర్వాత, మళ్లీ అంత మనస్ఫూర్తిగా నవ్వడం చిరంజీవికి అదే మొదటిసారి.

(సుందరంగారూ ఈ అయిడియా మీదే.
అందుకే ఈ కథకూడా మీదే) - స్వాతి.

★ ★ ★